సీసీ రోడ్డు పనులు ప్రారంభం



చెన్నాపురంలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ శాంతి

జవహర్‌నగర్ : జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను సుందరమైన నగరంలా తీర్చిదిద్దుతామని మేయర్ శాంతి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ చెన్నాపురం చౌరస్తాలో రూ.3 లక్షల మున్సిపల్ నిధులతో సీసీరోడ్డు పనులను మేయర్ శాంతి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెన్నాపురంలో ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు పాడై అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకపై ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాశ్వతంగా పరిష్కరించామన్నార. కార్పొరేటర్లు లలితాయాదవ్, ప్రేమల శ్రీనివాస్, సాయి, లావణ్యసతీష్‌గౌడ్, రవి, నవీన్, రాజ్‌కుమార్, శారదామనోధర్‌రెడ్డి, బల్లి రోజాశ్రీనివాస్, కాంట్రాక్టర్ బాలరాజు, ఉమర్, విష్ణు తదితరులున్నారు.

రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులు

మేడ్చల్ : పట్టణంలోని 21వ వార్డులో మున్సిపల్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి కౌన్సిలర్ కృష్ణవేణి రవీందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. వార్డులో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ శైలజ, నాయకులు ప్రతాప్, పాండు ,ఈశ్వరయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరో వార్డులో..

పట్టణంలోని 6వ వార్డులో చేపట్టిన సీసీరోడ్డు పనులను వార్డు కౌన్సిలర్ మణికంఠగౌడ్ ప్రారంభించారు. రూ.20 లక్షల మున్సిపల్ నిధులతో రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు మోనార్క్ తదితరులు పాల్గొన్నారు.

18వ వార్డులో..

సీసీ రోడ్డు పనులను వార్డు కౌన్సిలర్ భవాని రాఘవేందర్‌గౌడ్ ప్రారంభించారు. మున్సిపల్, ప్రభుత్వం సహకారంతో వార్డులోని ప్రతీ గల్లీలో రోడ్డును నిర్మిస్తామని స్పష్టం చేశారు.



21వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న బీజేపీ నేత బండారి శ్రీనివాస్‌రెడ్డి

కీసర: ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కీసర గ్రామ బీజేపీ శాఖ అధ్యక్షుడు బండారిశ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ప్రాథమిక పాఠశాలను ఆయన స్థానిక బీజేపీ నేతలతో కలిసి పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, శానిటేషన్ తదితర విషయాలను అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోయారు. గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలను పట్టించుకోకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ప్రభుత్వ పాఠశాలు బాగుపడుతాయని భావించామని, పరిస్థితులు మెరుగు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. మెట్టు మహేందర్ యాదవ్, ఆంజనేయులు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

- 176 పాఠశాలల్లోనే అభివృద్ధి పనులు
- పూర్తయినవి 40 శాతం మాత్రమే
- 286 పాఠశాలల్లో తాత్కాలిక మరమ్మతులు



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం అత్యున్నత వసతులు కల్పిస్తామని 'మన ఊరు–మన బడి', 'మన బస్తీ' కార్యక్రమాలను తీసుకొచ్చింది. నిధుల లేమితో గుర్తించిన పనుల్లో 40 శాతానికి మించి పూర్తి కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఏళ్లుగా సర్కారు బడులు నిరాధరణకు గురయ్యాయని చెబుతూ... కనీస వసతులు కల్పించేందుకు సిద్ధమైంది. ఈ పనులను కాంట్రాక్టర్లతో కాకుండా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పనులను చేపడుతోంది.

జూన్ 10లోపు పూర్తి చేయాలని..

ఏప్రిల్‌లో ఇంజినీరింగ్ బృందాలను క్షేత్ర స్థాయికి పంపి అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించింది. సెలవుల్లో పనులను ప్రారంభించి తరగతుల ప్రారంభానికి (జూన్ 10) ముందే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా పనుల ప్రారంభానికి ముందే మొత్తం బడ్జెట్లో 10 శాతం నిధులు విడుదల చేశారు. ఎన్నికల కోడ్ వచ్చినా పనులు పూర్తి చేయించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించారు.

◆ పాఠశాలలు పునఃప్రారంభమై 25 రోజులు గడుస్తున్నా ముందుకు సాగడం లేదు. పనుల పురోగతిపై జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఆరా తీయగా.. బిల్లులు రాకపోవడంతోనే నిలిచిపోయినట్లు తెలిసింది.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా ప్రభుత్వ పాఠశాలలు 505 ఉండగా.. గత ప్రభుత్వం ప్రతి మండలంలో 8 నుంచి 10 పాఠశాలలను గుర్తించి ఈ పథకం కింద 176 పాఠశాలల్లో అదనపు గదులు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేసినా ఇప్పటి దాకా 40 శాతానికి మించి పనులు పూర్తి కాలేదు.

ప్రస్తుత ప్రభుత్వంలో..

'మన ఊరు–మన బడి–మన బస్తీ' పథకానికి సంబంధం లేకుండానే జిల్లాలో 15 మండలాల పరిధిలోని 286 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు గుర్తించిన 699 అత్యవసర పనులకు ప్రభుత్వం రూ.12.01 కోట్లు మంజూరు చేసింది.

◆ మంజూరైన నిధులతో 10 రకాల పనులను పంచాయతీరాజ్, విద్యుత్తు, ఆర్అండ్‌బీ, ఈడబ్ల్యూఐడీసీ, టీఎస్ఈడబ్ల్యూ, ఓడీసీ విభాగాల ఇంజినీరింగ్ అధికారులు చేపట్టేలా చర్యలు తీసుకుంటుంది.

◆ మేడ్చల్ మండలంలో 28 ప్రభుత్వ పాఠశాలల్లో గుర్తించిన అత్యవసర పనులను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు నిర్వహిస్తున్నారు.

◆ శామీర్‌పేట సహా వివిధ మండలాల్లో ఈ విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే లోపు పూర్తయ్యేలా ప్రభుత్వం రూ.6.01 కోట్ల నిధులను విడుదల చేసింది.

◆ 207 మాత్రమే పనులు పూర్తి..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీల పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలలో అత్యవసర పనులైన విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్, శానిటేషన్ సహా తదితర పనులు కొనసాగుతున్నాయి.

◆ 286 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తంగా 699 పనులను చేపట్టాలని గుర్తించినప్పటికీ, ఇప్పటి వరకు 207 పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఈ పనులన్నీ వెంటనే పూర్తి చేయాలని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశించిన నేపథ్యంలో విద్యాశాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటుంది.

◆ ఒక్కో పనికి నిధుల కేటాయింపు ఇలా..

పాఠశాలల్లో అత్యవసర పనులకు సంబంధించి కేటగిరి వారీగా నిధుల కేటాయింపులను ప్రభుత్వం ప్రకటించింది. విద్యుత్తు అవసరాలకు రూ.25 వేలు, టాయిలెట్స్‌కు రూ.35 వేలు, తాగునీటి వసతి కల్పనకు రూ.లక్ష వరకు నిధులు వెచ్చించాలనే నిబంధనలతో 10 రకాల పనులకు నిధులను ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వం మహిళా సంఘాల బలోపేతం లక్ష్యంగా పాఠశాలల్లో కనీస అవసరాలను తీర్చాలన్న ఆశయంతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

రైల్వే వంతెన నిర్మాణంపై ఇరు పార్టీల డ్రామాలు !



హనుమాన్, బీజేపీ నేత

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులపై గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ డ్రామాలు ఆడుతున్నాయని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విప్పర్ల హనుమాన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. దశాబ్దకాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వం వంతెన పనులు పెండింగ్‌లో పెట్టిందన్నారు. కాంగ్రెస్ నేతలు వంతెన పనులు పూర్తి చేయించకుండా నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలు వంతెన పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీనిపై వారికి చిత్తశుద్ధి ఉంటే సంబంధిత అధికారులు, మంత్రితో కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

శామీర్‌పేట్ : బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అంతరించి పోయిందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మల్కాజ్‌గిరి బీజేపీ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం బుధవారం అంతాయిపల్లిలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్నాడని, అందుకే ప్రజలు ఓట్ల ద్వారా మద్దతు తెలిపారన్నారు. మరో ఐదేళ్లలో తెలంగాణలో సైతం బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మాల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆర్.కె. శ్రీనివాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ ఎన్నిక



బోడుప్పల్: న్యూ సాయి మారుతీనగర్ కాలనీలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి. మల్లేశ్ ఎన్నిక కాగా వారితో బోడుప్పల్ కాలనీల సంక్షేమ సంఘాల సమాఖ్య చైర్మన్ రాపోలు రాములు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 సంవత్సరంలో దాతల విరాళాలతో ఆలయ నిర్మించినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఒకరు అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ కనీసం బ్యాంక్ ఖాతా కూడా తెరవలేదన్నారు. దీంతో పాత కమిటీని రద్దు చేసి కొత్త కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో తోటకూర శ్రీశైలం యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ



అల్వాల్: లయన్స్ క్లబ్ ఆఫ్ నేరెడ్‌మెట్ ఆధ్వర్యంలో అల్వాల్‌లోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు యూనిఫాంలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదువుకుని తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఇన్నారెడ్డి, శేఖర్‌రెడ్డి, చంద్రమోహన్, శ్రీనివాస్, సురేశ్, హరినాథరావు, స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మల్లాపూర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని నాచారం డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ నవనీతరావు అన్నారు. జాతీయ వన మహోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల అవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. అనంతరం రాఘవేంద్రనగర్ కాలనీలో ర్యాలీ తీశారు. అలాగే విద్యార్థులు ప్రకృతిపై వేసిన నృత్య, నాటికాలు పర్యావరణ సందేశాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, కోర్ హెడ్‌ఆపరేషన్స్ కిశోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుమమీనన్ వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

మౌలాలి: ఆరోగ్యాన్ని రక్షించుకోవాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని మల్కాజ్‌గిరి ట్రాఫిక్ అదనపు సీఐ మల్లేశ్ అన్నారు. షేక్ అంబ్రేల్ల ఫౌండేషన్, ఐ సేవ్ మై ఎర్త్ క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం నాగేంద్ర హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని షేర్ అంబ్రేల్ల ఫౌండర్ విజయఅర్చనతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ బీజేపీ కో–కన్వీనర్ మల్లికార్జున్‌గౌడ్ తండ్రి జనార్దన్‌గౌడ్ దశదినకర్మకు బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, నాయకులు హాజరై కుటుంబసభ్యులను పరామర్శించారు.

NOTICE

IN THE COURT OF THE V ADDL. DIST. JUDGE, GUNTUR
M.V.O.P No. 1106 / 2023

Between :
Shaik Bharu Bi & Another. ...Petitioners
and
Mohammad Rizwan & others. ...Respondents

To,
R-1: Mohammad Rizwan, S/o.Yaseen P.No.60, 21st Century presidency Colony, Palakalakunta, Near Sri Balaji Hospital, Kompa, Medchal, Hyderabad, Telangana.
(Owner of Lorry bearing No. AP 10 U 8519)
[illegible] 22-07-2024 [illegible] 10-30 [illegible]

R. SRI CHARANI
Advocate for Petitioners, Guntur. Cell:9378460600

చేపల ఉత్పత్తి, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి



సాక్షి,మేడ్చల్ జిల్లా : చేప పిల్లల ఉత్పత్తి, మార్కెటింగ్ కోసం తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలను ఆవిష్కరించేందుకు ప్రతి ఏటా (జూలై 10న) మత్స్య కృషి వలుల జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు డీఎఫ్‌సీఎస్ జిల్లా చైర్మన్ మన్నె రాజు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో మత్స్యకారుల సమావేశం నిర్వహించారు. చేప పిల్లల ఉత్పత్తికి విశేష కృషి చేసిన పిరాలాల్ చౌదరి, అలీఖుని జ్ఞాపకార్థంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తామని చైర్మన్ పేర్కొన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమా మాట్లాడుతూ.. చేపల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని సంబంధిత రైతులు, మత్స్యకారులకు ఆమె పిలుపునిచ్చారు. చేపల పెంపకంతో పాటు మార్కెటింగ్ వసతులు తదితర విషయాలపై సంబంధిత చేపల రైతులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చేపల ప్రోటీన్ కోసం పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దేశ ఆహార భద్రతకు దోహదం చేయడంలో చేపల రైతులు ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారన్నారు. డీఎఫ్‌సీఎస్ సభ్యులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక దినోత్సవం...

ఘట్‌కేసర్ : మేడ్చల్ జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నె రాజుముదిరాజ్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. జాతీయ మత్స్య పారిశ్రామిక దినోత్సవం సందర్భంగా ఘట్‌కేసర్ ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు రాధాకృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా డైరెక్టర్లు వేణుగోపాల్‌ముదిరాజ్, మేడబోయిన వెంకటేశ్‌ముదిరాజ్‌ను ఘట్‌కేసర్, ఎదులాబాద్‌ముదిరాజ్ సంఘం సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. మత్స్యకారుల సంక్షేమం కోసం కృషి చేస్తానని, సంఘం సభ్యులు సహకరించాలని కోరారు. లింగం, బాలరత్నం శ్రీశైలం, ఆంజనేయులు, శంకర్, ఐలయ్య, రాజు, గండయ్య, నరేష్, రామకృష్ణ, నాగులు, పాండు, మహేష్, మల్లేష్, బాలయ్య, శ్రీరాములు, బస్వయ్య, బుజ్జిరాజు పాల్గొన్నారు.

అభినందన



ట్రైకార్ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైస్ చైర్మన్ రెడ్యానాయక్

పోచారం: తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ (గిరిజన ఆర్థికాభివృద్ధి సంస్థ) చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తేజావత్ బెల్లయ్యానాయక్‌ను పోచారం మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్ బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. బోడుప్పల్ కార్పొరేటర్ భూక్యా సుమన్, ఏబీఎస్ఎస్ మేడ్చల్ జిల్లా కోశాధికారి డీఎస్ నాయక్ తదితరులున్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్



బొంత శేఖర్



జంగలం లక్ష్మి

పోచారం: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న నిందితులను పోచారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. యంనంపేట్‌లోని కిట్టీస్టీల్ కంపెనీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూడగానే పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా.. బంగారు, వెండి ఆభరణాలు లభించాయి. నిందితులను గజ్వేల్‌కు చెందిన బొంతశేఖర్ (24), జంగలం లక్ష్మి (35)గా గుర్తించారు. శేఖర్ హయత్‌నగర్ మండల పరిధిలోని గౌరెల్లి, లక్ష్మి నాచారంలోని పాత మల్లాపూర్‌లో ఉంటూ చోరీలు పాల్పడుతున్నారు. వీరిపై ఇప్పటికే హయత్‌నగర్, జవహర్‌నగర్, ఘట్‌కేసర్, పోచారం పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం మున్సిపల్ పరిధిలోని తారక ఎన్‌క్లేవ్‌లోని పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఏడాది మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో పెద్దఎత్తున వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించేందుకు తగిన చర్యలు చేపట్టామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్ కళావతి, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వారంతపు సంతలు

మేడ్చల్ : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతివారం కూరగాయాలు, ఇతర సామగ్రి విక్రయించే వారంతపు సంతల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

సోమవారం – రైల్వేస్టేషన్ రోడ్డు (పోలీస్ క్వార్టర్స్ రోడ్డు), అత్వెల్లి మంగళవారం– ఉమానగర్, కేఎల్ఆర్ విజయానగర్

బుధవారం – ఎన్‌జీటీఎస్‌కాలనీ (మేడ్చల్)

గురువారం – వీకర్ సెక్షన్ కాలనీ (జెడ్పీహెచ్ఎస్ స్కూల్)

శుక్రవారం– సూర్యనగర్, చంద్రానగర్

శనివారం– హౌజింగ్‌బోర్డు కాలనీ, కిష్టాపూర్, చెక్‌పోస్టు, ఆర్టీసీ కాలనీ

ఆదివారం– ప్రధాన మార్కెట్.

ఆస్తిపన్ను మదింపులో అక్రమాలు

- భవన విస్తీర్ణం కొలతల్లో తేడాలు
- ఏళ్ల తరబడి ఇంటి నంబర్లు కేటాయించని వైనం
- ప్రత్యేక చర్యలకు అధికార యంత్రాంగం సన్నద్ధం

సాక్షి,మేడ్చల్ జిల్లా : నగర శివారుపురపాలక సంఘాలు, పంచాయతీల పరిధిలో ఏళ్లుగా ఆస్తిపన్ను ఆదాయానికి గండి పడుతుంది. దీంతో ఆదాయం లేక పురపాలికలు, గ్రామ పంచాయతీల నిర్వహణ భారంగా మారుతోంది. పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, వందలాది ప్రైవేటుభవనాలు, అపార్టుమెంట్లు, వ్యాపార, వాణిజ్యం, విద్యాసంస్థలు, హాస్టళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వాటికి ఏళ్ల తరబడి ఇంటి నంబర్లు కేటాయించకపోవడంతో ఆస్తిపన్నుకు భారీగా గండి పడుతుందని సంబంధిత శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు అందించడం గమనార్హం. లక్ష్యాలకు అనుగుణంగా పన్నుల వసూళ్లలో అలసత్వం వహిస్తుండటంతో కూడా ఖజానాలో నిధులు జమ కావడం లేదు.

మదింపులో అక్రమాలు..

నగర శివారుల్లో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలు మేడ్చల్ జిల్లాలో ఉండగా.. మిగతా మూడు నగర, 13 పురపాలికలు రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్నాయి.

◆ దాదాపు రెండు, మూడు పురపాలక సంఘాలు మినహాయించి మిగతా వాటిల్లో ఆస్తిపన్ను మదింపులో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

◆ బోడుప్పల్, జవహర్‌నగర్, బడంగ్‌పేట, మీర్‌పేట, నిజాంపేట్, ఘట్కేసర్, నాగారం, పోచారం, దమ్మాయిగూడ, కొంపల్లి, మేడ్చల్, తూముకుంట తదితర పురపాలక సంఘాల్లో ఆస్తిపన్ను మదింపుల్లో తేడాలు ఉన్నట్లు సమాచారం.

పర్యవేక్షణ కరువు..

ఉన్నతాధికారుల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవటంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పన్నుల మదింపు, ఇంటి నంబర్ల కేటాయింపుల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. భవనాల యజమానులతో పలువురు ఉద్యోగులు కుమ్మక్కై చేతివాటంతో నిబంధనలు బేఖాతర్ చేస్తూ.. తక్కువ ఆస్తిపన్ను మదిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాణిజ్య భవనాలను నివాస భవనాలుగా, అనుమతులు లేని వాటికి, అదనపు అంతస్తులకు పన్ను మదించకుండా చేతులు దులుపుకొంటున్నట్లు విమర్శలున్నాయి. పన్ను ఎగవేత వెలుగులోకి..

విద్యాసంస్థలు ప్రస్తుతం చెల్లిస్తున్న ఆస్తి పన్ను, భవనాల విస్తీర్ణంపై ఉన్న తేడాలను పరిశీలిస్తే పన్ను ఎగవేస్తున్న విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో అనుమానం ఉన్న భవనాల కొలతలు తీయాలని నిర్ణయించినట్లు సమాచారం.

◆ శివారులోని పలు పురపాలికల్లో భవనాలతో పాటు అపార్టుమెంట్లలోని ఇంటిపన్ను మదించని వాటిని సిబ్బంది గుర్తించేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా పురపాలిక సంఘాలు, గ్రామ పంచాయతీల ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

ఆస్తిపన్ను తక్కువగా ఉంటే...

ఆస్తిపన్ను తక్కువగా మదించారన్న అనుమానం ఉన్న భవన నిర్మాణాలకు తిరిగి కొలతలు తీసి నిబంధనల మేరకు పన్ను విధించేలా చర్యలకు ఉపక్రమించాలని పురపాలక అధికారులు యోచిస్తున్నారు. దశల వారీగా భవనాల ఆస్తిపన్నును సవరించాలని భావిస్తున్నారు.

గత వ్యత్యాసాలను దృష్టిలో ఉంచుకుని..

గత వ్యత్యాసాలను గుర్తించి పన్నును ఈ ఆర్థిక సంవత్సరం నుంచి వసూలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో భవనాలకు తీసిన కొలతలు, మదించిన పన్నుపై అనుమానం ఉన్న పక్షంలో యజమానులు పురపాలక సంఘాల దృష్టికి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

మేడ్చల్ కాంగ్రెస్ నేతలకు మొండిచేయి!

- ఆశించిన వారికి దక్కని నామినేటెడ్ పోస్టులు
- తీవ్ర నిరాశలో జిల్లా నాయకులు

మేడ్చల్ : మేడ్చల్ జిల్లాలో 5 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఓ ఎంపీ నియోజకవర్గం ఉన్న అధికార పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు లేరు. దీంతో అధికార పార్టీ నామినేటెడ్ పదవులను రాష్ట్ర వ్యాప్తంగా భర్తీ చేసినా జిల్లా నాయకులకు ఏ ఒక్క పదవి కూడా ఇవ్వకపోవడం చర్చనీయాంశమైంది. మేడ్చల్ జిల్లాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, ఉప్పల్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు, మల్కాజ్‌గిరి ఎంపీ స్థానాలు ఉన్నాయి. ఎంపీగా బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ ఉండగా.. ఎమ్మెల్యేలుగా బీఆర్ఎస్‌కు చెందిన మల్లారెడ్డి, వివేక్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారావు, లక్ష్మారెడ్డిలు ఉన్నారు.

◆ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. మేడ్చల్ జిల్లాలో అధికార పార్టీకి ఒక్క ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ లేకపోవడంతో అధికార పార్టీ కేడర్ నిరాశలో ఉన్నట్లు సమాచారం.

◆ ఐదు నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన నాయకులు మినహా చాలా మంది టికెట్ ఆశించి భంగపడ్డవారే ఉన్నారు.

◆ మేడ్చల్ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన తోటకూర వజ్రేష్‌యాదవ్ ఓడిపోగా.. టికెట్‌ను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సీనీయర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌లు ఆశించి భంగపడ్డారు. నామినేటెడ్ పదవుల పంపకంలో ఎవరికీ లభించకపోవడంతో నిరుత్సాహపడ్డారు.

◆ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన సుధీర్ రెడ్డి, ప్రభాకర్‌గౌడ్‌లు నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్నట్లు వినికిడి. కుత్బుల్లాపూర్‌లో భూపతిరెడ్డి, జ్యోత్స్న శివారెడ్డిలు ఆశపడిన టికెట్ హనుమంత్‌రెడ్డికి రాగా ఆయన ఓడిపోయారు. ఎన్నికల తర్వాత మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ కాంగ్రెస్‌లో చేరినా నామినేటెడ్ పదవుల కోసం ఆశపడ్డా ఏ ఒక్క నాయకుడికి పదవి దక్కలేదు.

◆ కూకట్‌పల్లిలో టికెట్ రమేష్‌కు వెళ్లగా.. సత్యం శ్రీరంగం, నామినేటెడ్ పోస్టుపై ఆశ పెట్టుకున్నా ఆయనకు స్థానం దక్కలేదు. ఉప్పల్, మల్కాజ్‌గిరిలో పదవుల కోసం ఆశిస్తున్న వారి సంఖ్య తక్కువగా ఉంది.

◆ మేడ్చల్ జిల్లాలో తమ తమ నియోజకవర్గాల్లో పార్టీ కోసం పనిచేసిన నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల, డివిజన్ స్థాయి నాయకులకు వారి స్థాయికి తగినట్లుగా ఎలాంటి పోస్టులు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో కేడర్‌లో జోష్ లేకుండా పోయింది.

◆ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, డైరెక్టర్లు, ఆలయాల కమిటీలు, ఆర్‌టీఏ డైరెక్టర్లు, ఇతర శాఖల డైరెక్టర్లు వంటి పోస్టుల్లో పార్టీకి కష్టకాలంలో పనిచేసిన నాయకులకు సముచిత స్థానం కల్పించాలని కోరుకుంటున్నారు. నియోజకవర్గ స్థాయి నాయకులకు ప్రభుత్వంలో అవకాశం కల్పించి అధికార కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తే ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పనులను మరింతగా ప్రజల వద్దకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నామినేటెడ్ పోస్టుల భర్తీతో ఇతర జిల్లా నాయకులకు న్యాయం చేసినా మేడ్చల్ జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో ఒక్క నాయకుడికి పదవి యోగం దక్కకపోవడంతో నాయకులతో పాటు పార్టీ కేడర్ ఒక్కసారిగా నైరాశ్యంతో ఉన్నట్లు తెలుస్తోంది.